మోక్షగుండం ఆదర్శప్రాయుడు



మోక్షగుండం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాగభూషణం, అలీమ్‌బాషా


సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

పుంగనూరు: భారతరత్న, దివంగత మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆదర్శప్రాయుడని రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం స్మరించారు. శుక్రవారం మున్సిపాలిటీలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించి అయన మాట్లాడారు. మోక్షగుండం విధానాలతో ఇంజినీరింగ్ రంగంలో ముందుకెళ్తున్నామని, అయన స్ఫూర్తితో ఇంజినీర్లు అంకితభావంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి, మున్సిపల్ డీఈఈ మహేష్, ఏఈ కృష్ణకుమార్, సీఐ రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ లలిత, వైస్ చైర్మన్ నాగేంద్ర, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పార్టీ నాయకులు జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: తాగునీరు, సాగు నీటి ప్రాజెక్టుల రూపశిల్పి మోక్షగుండం విశ్వేశ్వరయ్య యువతకు ఆదర్శమని బీసీఎన్ విద్యాసంస్థల చైర్మన్ నాగరాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఘనంగా ఇంజినీర్స్ డే నిర్వహించారు. విశ్వేశ్వరయ్య దేశానికి చేసిన సేవలను స్మరించారు. కృష్ణారాజ్ సాగర్ ఆనకట్ట, తిరుపతి–తిరుమల మధ్య రోడ్డు మార్గం, భద్రావతి ఉక్కు కర్మాగారం..సృష్టికర్త ఆయనేనన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని ఇంజినీరింగ్ విద్యార్థులు దేశానికి సేవలు అందివ్వాలని కోరారు. ముఖ్యఅతిథి లయన్స్ క్లబ్ చైర్మన్ భక్తవత్సలరెడ్డి సన్మానించారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచిన ఇంజినీరింగ్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుధాకర్ బాబు, లెక్చరర్లు పాల్గొన్నారు.

'సైకిల్'కు పంక్చర్!

- మంత్రిని కలిసిన టీడీపీ నాయకుడు
- త్వరలో వైఎస్సార్ సీపీలో చేరిక?


మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి (వృత్తంలో), ఎంపీపీ

రొంపిచెర్ల: పుంగనూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి కాస్తో కూస్తో చెప్పుకోదగ్గ నాయకులు ఉన్న రొంపిచెర్ల మండలంలో 'సైకిల్'కు పంక్చర్లవుతున్నాయి. ఈమధ్య పుంగనూరులో పోలీసులపై దాడి కేసులో అరెస్ట్ అయి, రిమాండ్‌లో ఉన్న పలువురు టీడీపీ నాయకుల్లో మండలానికి చెందిన వారూ ఉన్నారు. దాడి ఘటన అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు, తాజాగా పార్టీ అధినేత చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో జైలు పాలవడంతో ఆ పార్టీ నాయకులు పునరాలోచనలో పడ్డారు. ఇక టీడీపీలో తమకు భవిష్యత్తు ఉండదనే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నట్టు తాజా పరిణామాలు తేటతెల్లం చేస్తున్నాయి. పలమనేరు నియోజకవర్గంలో కీలక టీడీపీ నేత సుభోస్ ఇటీవలే మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలవడం తెలిసిందే. ఇప్పుడు మండల టీడీపీ నాయకుడు గుండ్లూరి రామచంద్రారెడ్డి కూడా అదే బాట పట్టారు. శుక్రవారం ఆయన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మార్కెట్ యార్డు వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మండలంలోని కొన్ని పంచాయతీలపై పట్టు ఉంది. గతంలో ఆయన రెండుసార్లు టీడీపీ మద్దతు అభ్యర్థిగా జెడ్పీటీసీ స్థానానికి పోటీ చేశారు. పార్టీకి ఎంతగా ఖర్చు చేసినా తగిన గుర్తింపు ఇవ్వకపోవడం, తనను కూరలో కరివేపాకులా వాడుకుంటున్నారని ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మంత్రిని కలవడం ఆ పార్టీలో చర్చకు దారితీసింది. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబు స్వగ్రామమైన బొమ్మయ్యగారిపల్లెకు చెందిన ఆయన తన అనుచరులతో కలసి త్వరలోనే మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరనున్నట్టు తెలిసింది.

క్లుప్తంగా

నూతన పింఛన్ల పంపిణీ


నూతన ఫించన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

రామకుప్పం: మండలంలోని వీర్నమల పంచాయతీలో కొత్తగా 64మందికి మంజూరైన పింఛన్లను శుక్రవారం వైఎస్సార్ సీపీ నేతలు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పెద్దతండా సర్పంచ్ మోహన్ నాయక్, రెస్కో డైరెక్టర్ రవినాయక్, భాస్కర్‌నాయక్, చిన్నరాజు నాయక్, కామరాజునాయక్, స్వామినాయక్, సోమశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

నిరసనకు న్యాయవాదుల యత్నం

పలమనేరు: పట్టణ సమీపంలోని కోర్టులో కొందరు టీడీపీ సానుభూతిపరులైన న్యాయవాదులు టీడీపీ అధినేత చంద్రబాబు రిమాండ్‌పై నిరసన వ్యక్తం చేయడానికి యత్నించారు. అయితే 144 సెక్షన్, 30 పోలీస్ యాక్టు అమలులో ఉండడంతో రోడ్డుపైకి రాకూడదని స్థానిక ఎస్‌ఐ సుబ్బారెడ్డి వారికి హితవు పలికారు. అయితే వారు దాన్ని పట్టించుకోకుండా నినాదాలు చేస్తూ హైవేలోకి వచ్చేందుకు యత్నించారు. పోలీసులు వారిని నిలువరించడంతో చేసేదేమీలేక వెనుదిరిగారు.

రెడ్డి కమ్యూనిటీ కన్వీనర్‌గా రమేష్‌రెడ్డి



పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండల రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ కన్వీనర్‌గా మతుకువారిపల్లెకు చెందిన ఎం.రమేష్‌రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు వై.సురేంద్రరెడ్డి నియామక పత్రం అందజేశారు. రెడ్డి కులస్తుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

అంత్యక్రియలకు ఎమ్మెల్సీ ఆర్థిక సాయం


మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న నాయకులు

గుడుపల్లె: మండలంలోని సంగనపల్లెకు చెందిన చౌడమ్మ అనారోగ్యంతో బాధపడుతు శుక్రవారం మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎమ్మెల్సీ భరత్ మృతురాలి అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలను సర్పంచ్ అమరనాథ్, పార్టీ నాయకులు విశ్వనాథ్, మోహన్, వరదరాజులు ద్వారా ఆ కుటుంబానికి అందజేశారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత


ఆస్పత్రి సిబ్బందికి వీల్ చైర్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్

కుప్పం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ అన్నారు. శుక్రవారం కుప్పం ఏరియా ఆస్పత్రికి ప్రభుత్వం మంజూరు చేసిన ఐదు వీల్ చైర్లను ఆస్పత్రి సిబ్బందికి ఆయన అందజేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడుతో విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. శుక్రవారం ఐదు మెడికల్ కళాశాలలను ప్రారంభించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

హర్షం

పలమనేరు: ఏటా సెప్టెంబర్ 17న విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా జీఓ నంబర్ 24 విడుదల చేయడంపై స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రంలోని విశ్వ బ్రాహ్మణులకు ఎంతో ఆనందాన్నిచ్చిందని పేర్కొన్నారు.

ఆసుపత్రి నిర్మాణ పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న అధికారులు

సదుం: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తు న్న యాభై పడకల ఆసుపత్రి పనులను వైద్య, ఆ రోగ్య శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించా రు. పనుల నిర్వహణపై జెడ్పీటీసీ సభ్యుడు సో మశేఖర్‌రెడ్డితో మాట్లాడారు. నిర్మాణ పనులు దా దాపు పూర్తి అవడంతో త్వరలోనే ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్ర మంలో ఎస్‌ఈ కృష్ణారెడ్డి, ఈఈ లక్ష్మీపతిరెడ్డి, డీఈ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

పులిచెర్ల(కల్లూరు): వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరని కల్లూరు ఎస్సై రవిప్రకాష్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉత్సవకమిటీ విగ్రహాలు ఏర్పాటు చేసే చోట ముగ్గురు వ్యక్తులు తప్పనిసరిగా ఉండాలని, నిమజ్జనం సమయంలో చిన్నపిల్లలను తీసికెళ్లరాదన్నారు. ఈ నిబంధనలు విధిగా పాటించాలన్నారు.

'చవితి' నిర్వహణకు సహకరించండి


మాట్లాడుతున్న చైర్మన్ అలీమ్‌బాషా

పుంగనూరు: వినాయక చవితి పండుగను ప్రశాంతంగా నిర్వహించేందుకు పట్టణ ప్రజలు అధికారులకు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా కోరారు. శుక్రవారం మున్సిపాలిటీలో కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో చవితి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ, పట్టణంలో ట్రాఫిక్, పారిశుద్ధ్య కార్యక్రమాలకు ఇబ్బంది కలగకుండా చిన్నచిన్న పందిళ్లలో విగ్రహాలను పెట్టాలన్నారు. నిర్వాహకులు మున్సిపల్, పోలీస్ అనుమతి విధిగా పొందాలన్నారు. సీఐ రాఘవరెడ్డి మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటు, నిమజ్జనం కార్యక్రమాలకు తమ అనుమతి పొందాలన్నారు. విగ్రహాల ఏర్పాటులో నిర్వాహకులు అన్ని భద్రత నిబంధనలు పాటించాలన్నారు. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు మాట్లాడుతూ, వినాయకుడి విగ్రహాల ఏర్పాటులో విద్యుత్ లైన్లు తీసుకునే సమయంలో భద్రత పాటించాలన్నారు. విద్యుత్‌లైన్లు లేని ప్రాంతంలో తక్కువ సైజులో విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, మున్సిపల్ చైర్మన్లు లలిత, నాగేంద్ర, కౌన్సిలర్లు నరసింహులు, పూల త్యాగరాజు, పార్టీ నాయకులు ఆవుల అమరేంద్ర, జయరామిరెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే అధిక పాల దిగుబడి


పాడిరైతులకు మినరల్ మిక్చర్, మందులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

చౌడేపల్లె: రైతులు పాడి పోషణలో తగిన జాగ్రత్తలు పాటిస్తే అధిక పాల దిగుబడి పొందవచ్చని పశువైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. శుక్రవారం గడ్డంవారిపల్లె పంచాయతీ బత్తలాపురంలో వాటర్‌షెడ్ సహకారంతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. 285 పశువులకు వైద్య పరీక్షలు చేసి, పిడుదుల నివారణకు బ్యూటాక్స్ పిచికారీ చేశారు. ముద్దచర్మ వ్యాధి, నట్టల నివారణకు మందు తాపించి, వ్యాక్సిన్లు వేశారు. పచ్చిమేతతోపాటు దాణా వేస్తే పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. అనంతరం ఎంపీపీ రామమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజు పాడిరైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ పీఓ వర్మ, ఎంపీటీసీ శ్రీరాములు, చైర్మన్ పెద్దన్న, సర్పంచ్ భాగ్యవతి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆర్థిక సాయం


ఆర్థిక సాయాన్ని చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వి.కోట: ఓ యువకుడి శస్త్రచికిత్సకు రూ.60 వేల ఆర్థికసాయం చేసి లయన్స్‌క్లబ్ తన దాతృత్వాన్ని చాటుకుంది. వివరాలు..పట్టణానికి చెందిన సోమశేఖర్ సింగ్ కుమారుడు విక్రమ్‌సింగ్ వారం క్రితం కుప్పం వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనికి అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు లయన్స్‌క్లబ్‌ను సంప్రదించడంతో స్పందించింది. శుక్రవారం క్లబ్ అధ్యక్షుడు లోకేష్ వారికి రూ.60వేలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మంజునాథ్, కోశాధికారి శబరీష్, సభ్యులు వినయ్ పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

చౌడేపల్లె: సారా విక్రేతలను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ శుక్రవారం తెలిపారు. వివరాలు..అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి దుర్గసముద్రం పంచాయతీ డి.రాజులురులో దాడులు చేశారు. గ్రామస్తుడు ఎస్.మునిరాజ ఇంటిలో 20 ప్యాకెట్ల సారా స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

మోపెడ్‌ను కారు ఢీ - ఒకరికి తీవ్రగాయాలు

పెద్దపంజాణి: ఆగి వున్న ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. శుక్రవారం ఈ సంఘటన పుంగనూరు–పలమనేరు రహదారిలోని ఒంటిల్లు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. గంగవరం మండలం కలగటూరుకు చెందిన కృష్ణప్ప(70) ఒంటిల్లు సమీపంలో తన సూపర్ ఎక్స్‌ఎల్ వాహనంలో గ్రామానికి వెళ్లేందుకు రోడ్డు పక్కన ఆగి వున్నాడు. ఇంతలో పుంగనూరు నుంచి పలమనేరుకు వెళుతున్న శాంత్రో కారు వేగంగా ఢీకొనడంతో కృష్ణప్ప తల, కాలికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన అతడిని పలమనేరు ఏరియా ఆస్పత్రికి 108లో తరలించారు.

ఆయన మృతి పార్టీకి తీరని లోటు


బాలకృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: వైఎస్సార్ సీపీ నాయకుడు బాలకృష్ణారెడ్డి మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. చెంచెంరెడ్డిగారిపల్లెలో గుండెపోటుతో మృతి చెందిన బాలకృష్ణారెడ్డి భౌతికకాయానికి శుక్రవారం అయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ కష్టకాలంలో కూడా తన వెంటే ఆయన నడిచారని జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. బాలకృష్ణారెడ్డి కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మంత్రిపాటు నివాళులు అర్పించిన వారిలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, సర్పంచులు ఇబ్రహీంఖాన్, సుధారాణి, పలువురు నాయకులు ఉన్నారు.

చిన్నారులే దేశానికి రేపటి ఆస్తి


పౌష్టికాహార మాసోత్సవంలో అధికారులు ప్రజాప్రతినిధులు

పలమనేరు: నేటి చిన్నారులే దేశానికి రేపటి ఆస్తి అని పలమనేరు సీడీపీఓ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. మండలంలోని కొలమాసనపల్లె సెక్టార్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, అధిక పోషకాల ఆహారాన్ని గర్భిణులు తీసుకుంటే ఆరోగ్యవంతమైన శిశువులకు జన్మనిస్తారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన వంట సామగ్రిని పట్టణానికి చెందిన శ్రీపురం సీతారామయ్య వితరణ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గజేంద్ర, మొరం సర్పంచ్ విశ్వనాథ రెడ్డి, సూపర్‌వైజర్ నజ్మా, అంగన్‌వాడీ కార్యకర్తలు, సెంటర్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

మారెమ్మకు రాహుకాల పూజలు



పుంగనూరు: పట్టణంలోని శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో శుక్రవారం మధ్యాహ్నం అమ్మవారికి రాహుకాల పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి నెయ్యి, చలి పిండి దీపాలు వెలిగించి, పెరుగన్నం పెట్టి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ


గుడుపల్లె : మాట్లాడుతున్న జేసీఎస్ కన్వీనర్ రామక్రిష్ణ


సదుం: సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీఓ వరప్రసాద్

గుడుపల్లె: ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలుకు పూనుకుందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జేసీఎస్ కన్వీనర్ రామక్రిష్ణ కోరారు. శుక్రవారం మండలంలోని శెట్టిపల్లె, బెగ్గిలిపల్లె, కంచిబందార్లపల్లె గ్రామాలలో అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో ఇంటింటా సర్వేకు వచ్చిన వైద్యసిబ్బందికి ప్రజలు తమ ఆరోగ్యం గురించి పూర్తి సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో ఉన్న వారికి వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చంద్రప్ప, సంపంగి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం

సదుం: ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఎంపీడీఓ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం స్థానికంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. సర్వేలో కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను విధిగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉషారాణి, ఈఓ హసీనా, ఆరోగ్య సిబ్బంది హేమలత, దీప, వలంటీర్లు పాల్గొన్నారు.

30 నుంచి 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పులిచెర్ల(కల్లూరు): ఈనెల 30 నుంచి అక్టోబర్ 12వ తేదీ వరకు అన్ని గ్రామ సచివాలయ(విలేజ్ క్లినిక్)ల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, ఎంపీడీఓ రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చి ఈ కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి, వారి ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేయనున్నట్టు పేర్కొన్నారు.

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి సమస్యనూ గుర్తించి త్వరితగతిన పరిష్కరించేలా ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం ఎంపీడీఓ నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అజెండాను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. సర్పంచులు, ఎంపీటీసీలు తమ పరిధిలోని సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లతో కలసి గ్రామాల్లో వారానికోసారి పర్యటించాలన్నారు. నవరత్న పథకాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలపై నివేదికలు సిద్ధం చేసి మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. అలాగే సచివాలయానికి వచ్చే వినతులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత శాఖలకు పంపాలన్నారు. పుంగనూరు మండలం ఆదర్శవంతంగా పని చేస్తోందని, ఎన్నికల సమయంలో కూడా ఆ పేరు నిలబెట్టాలని కోరారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, తహసీల్దార్ సీతారామన్, వైస్ ఎంపీపీలు ఈశ్వరమ్మ, సరోజమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్ నియామకం

రొంపిచెర్ల: మండలంలోని రొంపిచెర్ల–3 అంగన్‌వాడీ టీచర్‌గా ఎంపికైన భవితకు నియామక పత్రాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం అందజేశారు. ఇక్కడ అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్న అనసూయ 15 రోజుల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఈ నేపథ్యంలో ఐసీడీఎస్ పీడీ నాగశైలజ ఇంటర్వ్యూలు నిర్వహించి దద్దాలవారిపల్లెకు చెందిన భవితను ఎంపిక చేశారు. విధి నిర్వహణలో కేంద్రానికి మంచి పేరు తీసుకుని రావాలని టీచర్‌కు మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉమాపతి నాయుడు, శ్రీకాంత్ నాయుడు, తులసీరామ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జింకను కాపాడారు



కుప్పం రూరల్: అడవి నుంచి దారి తప్పి జనావాసాల్లోకి జింక వచ్చిన సంఘటన కుప్పం మండలం నిమ్మకంపల్లెలో చోటు చేసుకుంది. వివరాలు.. శుక్రవారం మధ్యాహ్నం సమీప అటవీ ప్రాంతం నుంచి జింక గ్రామ పొలాల వైపు వచ్చింది. ఇది గమనించిన కుక్కలు జింకపై దాడి చేసి గాయపరిచాయి. కుక్కల బారి నుంచి దానికి గ్రామస్తులు కాపాడారు. సమాచారమివ్వడంతో అక్కడికి చేరుకున్న అటవీ అధికారులు అధికారులు జింకకు వైద్యం చేశారు. అది కోలుకున్నాక అడవిలో వదిలిపెట్టారు.

ముగిసిన మండలస్థాయి క్రీడాపోటీలు


పరుగు పోటీల్లో పరుగెడుతున్న బాలికలు


షాట్‌పుట్ వేస్తున్న విద్యార్థి

రామకుప్పం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఇండియా మండలస్థాయి పోటీలు శుక్రవారం ముగిశాయి. అండర్–14, అండర్–17 విభాగాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. శుక్రవారం 100, 200, 400, 600, 800, 1500 మీటర్ల పరుగుపందెం, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్క్ త్రో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు మండల కో ఆర్డినేటర్ మణి తెలిపారు. అలాగే, అండర్–14,అండర్–17 విభాగాల్లో వాలీబాల్,కబడ్డీ, టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మింటన్ నియోజక వర్గ పోటీలకు బాలబాలికలను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని పీఈటీలు, పీఈటీలు, 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.